క్లుప్తంగా

జీతాలు చెల్లించాలని వినతి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో చెత్తాచెదారాన్ని తొలగించి, గ్రామాలను శుభ్రంగా ఉంచుతున్నామని, జీతాలు చెల్లించాలని సోమవారం ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావుకు పారిశుద్ధ్య కార్మికులు విన్నవించారు. వారు మాట్లాడుతూ మండలంలో 66 మంది పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. 26 నెలలుగా జీతాలు ఇవ్వలేదని, దీంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. జీతాలు ఇవ్వకపోవడంతో పస్తులు ఉంటున్నామని, అధికారులు స్పందించి జీతాలు ఇవ్వాలని కోరారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు



గర్భిణీ హెల్త్‌రికార్డును పరిశీలిస్తున్న డాక్టర్ దివాకర్

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో మంగళవారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌లో భాగంగా గర్భిణులకు వైద్యాధికారి దివాకర్ వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గర్భం దాల్చిన వెంటనే ఏఎన్‌ఎం వద్ద గర్భిణీగా పేరు న మోదు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రి లో ప్రసవం అయితే జననీ సురక్ష కింద రూ.1000, ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకం కింద రూ. 5వేల నగదు ఉచితంగా ఇస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియో గం చేసుకోవాలని తెలిపారు. సీహెచ్‌ఓ వేంకటేశ్వర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన కావమ్మ కథ



బుర్రకథ చెబుతున్న కళాకారులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని గాంధీవీధిలో ఉన్న కావమ్మ ఆలయంలో ఏర్పాటు చేసిన కావమ్మ బుర్రకథ భక్తులను అలరించింది. తమిళనాడు రాష్ట్రంలో పళ్లిపట్టు నుంచి విచ్చేసిన శరవణ, నాగభూషణం బుర్రకథ ఆలపించారు. ఈ కార్యక్రమంలో కన్నయ్య, నెల్లూరు రవికుమార్, జగదీష్, చంద్రశేఖర్, గాంధీ, భక్తులు పాల్గొన్నారు.

విద్యతో ఉజ్వల భవిత



విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేస్తున్న రవిబాబు

ఏర్పేడు: విద్యతో ఉజ్వల భవిష్యత్తును పొందవచ్చని ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి మార్దాల రవిబాబు అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తవీరాపురం వడ్డిమిట్ట ప్రాథమిక పాఠశాలలో సంస్థ ఆధ్వర్యంలో నోటు పుస్తకాలు, పలకలు, పెన్‌లు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య ఒక ఆయుధమన్నారు. విద్యతో సమాజంలో అసమానతలు తొలగిపోతాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ చదువుకుని బంగారు భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని సూచించారు. బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలని పేర్కొన్నారు. పేద విద్యార్థులకు సంస్థ తరపున తమవంతు సేవచేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమం సంస్థ వలంటీర్లు మస్తాన్, పృథ్వి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీడీ కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాలు

రేణిగుంట: బీడీ కార్మికుల కుటుంబాలకు చెందిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ఉపకార వేతనాలు అందజేస్తుందని శ్రీకాళహస్తి బీడీ కార్మికుల వైద్యశాల వైద్యులు డాక్టర్ పవన్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ కింద పనిచేస్తున్న బీడీ కార్మికుల పిల్లలు ఈ ఉపకార వేతనాలకోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు 31-08-2024వ తేదీ లోపు, ఇంటర్మీడియట్, డిగ్రీ, వృత్తి విద్యాకోర్సులు చదివే వారు 31-10-2024 వ తేదీ లోపు scholarship.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలియజేశారు. ఇతర వివరాలకు స్థానిక బీడీ కార్మిక వైద్యశాలను సంప్రదించవచ్చన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని మంగళవారం కేంద్ర సమాచార శాఖ చీఫ్ కమిషనర్ హీరాలాల్ సమారియ, తిరుపతి ఎంపీ గురుమూర్తి, సంగీత దర్శకుడు విద్యాసాగర్, సినీ నటుడు గణేష్ వెంకట రామన్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనాలు అందించారు.

నందిపై పరాశరేశ్వరస్వామి చిద్విలాసం

- వేడుకగా స్నపన తిరుమంజనం
- 12న అర్జిత కల్యాణోత్సవం



నంది వాహనంపై పరాశరేశ్వరస్వామి

నారాయణవనం: టీటీడీ అనుబంధ చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం నంది వాహనంపై స్వామిఅమ్మవార్లు అధిరోహించి గ్రామ వీధుల్లో విహరించారు. ఉదయం అర్చకులు నిత్యపూజా కార్యక్రమాలను, పరివార దేవతలకు అభిషేకాలు చేసి, నైవేద్య సమర్పణ చేశారు. 10 గంటలకు చంపకవల్లీ, పరాశరేశ్వర్లకు సుగంధ, పరిమళ ద్రవ్యాలు, పంచామృతాలతో స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించి ధూప, దీప నైవేద్యాలను సమర్పించి భక్తులకు ప్రసాదాలను వితరణ చేశారు.

సాయంత్రం ప్రత్యేక పూజలను అందుకున్న ఉత్సవర్లు అలంకరించుకుని నంది వాహనాన్ని అధిరోహించారు. సర్కారు హారతి అందుకున్న దేవరులు గ్రామోత్సవంలో భక్తుల నుంచి హారతులు అందుకుని పురవీధుల్లో విహరించారు. స్థానిక ఆలయాల ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. బుధవారం సాయంత్రం గజవాహనం అధిష్టించి ఊరేగింపులో ఉత్సవమూర్తులు దర్శనం ఇవ్వనున్నారు. ఈనెల 12వ తేదీన ఆలయ ప్రాంగణంలో చంపకవల్లీ, పరాశరేశ్వర స్వామికి జరిగే ఆర్జిత కల్యాణోత్సవంలో రూ 500 చెల్లించి దంపతులు పాల్గొనవచ్చునని ఆలయ అధికారి నాగరాజు తెలిపారు.

సమన్వయంతో పనిచేసి ప్రగతి సాధించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

సత్యవేడు: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రగతి సాధించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. మంగళవారం ఎంపీపీ వి.ప్రతిమ అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే, జెడ్పీటీసీ సభ్యురాలు పి.విజయలక్ష్మి పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేదిలేదని అధికారులను హెచ్చరించారు. పంచాయతీలో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు సమన్వయంతో పనిచేసి మౌలిక వసతులు మెరుగుపరచాలన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని వైద్యులను కోరారు. సర్వసభ్య సమావేశానికి ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, ఇరిగేషన్ డీఈ, పశుసంవర్ధక శాఖ ఏడీ హాజరు కాకపోవడంపై ఎమ్మెల్యే అసంతృప్తిని వ్యక్తం చేశారు. వీరిపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్‌ను ఆదేశించారు.

11శాఖలకే పరిమితమైన సమీక్ష..

మండల పరిధిలో 23 శాఖల అభివృద్ధిపై అజెండా నిర్వహించాల్సి ఉంది. అయితే ఎమ్మెల్యే 11 శాఖల్లో జరిగిన అభివృద్ధి పనులను మాత్రమే తెలుసుకుని మిగిలిన 12 శాఖలు అభివృద్ధి పనులు, సమస్యలు తెలుసుకోకుండానే సమావేశం నుంచి ఎమ్మెల్యే వెళ్లిపోయారు. దీంతో ఎంపీడీఓ సమావేశం ముగించారు. తహసీల్దార్ రామాంజనేయులు, సీఐ దివాకర్ రెడ్డి, తెలుగుగంగ డీఈ ఓబుల్‌దాస్, అగ్రికల్చర్ ఏడీ సుబ్రమణ్యం, ఎంఈఓ కె. రవి, వైద్యులు గుణశేఖర్, మురళీకృష్ణ, విద్యుత్ ఏడీఏఈ చంద్రనాయక్, ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. స్థానిక కమ్యూనిటీ వైద్యశాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. మంగళవారం సత్యవేడు వైద్యశాలను ఆయన తనిఖీ చేశారు.

సెక్యూరిటీకి జీతాలు అందేనా?

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో విధులు నిర్వహించే సెక్యూరిటీ సిబ్బందికి జీతాలు అందక తీవ్ర ఇబ్బందు పడుతున్నారు. వారికి మూడు, నాలుగు నెలలకు ఒకసారి జీతాల చెల్లింపు జరుగుతోంది. ప్రస్తుతం నాలుగు నెలలకు జీతాలు రావాల్సి ఉంది. ఎన్నికలకు మునుపే కాంట్రాక్టర్‌కు గడువు ముగిసింది. అయితే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. తరువాత ఎన్నికల కోడ్ రావడంతో టెండర్లు పిలవడానికి వీలు లేక పొడిగిస్తున్నారు. పదిరోజుల క్రితం టెండర్లు కూడా జరిగాయి. అవి ఏ దశలో ఉన్నాయో కూడా తెలియదు. ఒంగోలుకు చెందిన ఏజెన్సీ ద్వారా జీతాలు చెల్లించాల్సి ఉంది. సంస్థ నిర్వాహకుడు శ్రీకాళహస్తికి రావడంలేదు. వచ్చినా బిల్లులు పెట్టడం లేదు. అధికారులు కూడా అడగడం లేదు. దీంతో సెక్యూరిటీ సిబ్బంది జీతాలు అందక కుటుంబ పోషణ సాగక అవస్థలు పడుతున్నారు. తమ బాధలు ఎ వరు తీరుస్తారు శివయ్య అంటూ వారు వాపోతున్నారు.

ఆటో యూనియన్ ఏర్పాటు



యూనియన్ ఏర్పాటు చేసుకున్న ఆటోడ్రైవర్లు

వరదయ్యపాళెం: మండలంలోని కడూరు కూడలి వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంబేద్కర్ ఆటోస్టాండ్‌ను ఆటోడ్రైవర్లు ఏర్పాటు చేసుకున్నారు. మంగళవారం సాయంత్రం ఆటోడ్రైవర్లు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఏఐటీయూసీ నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు చిన్నిరాజ్ ముఖ్యఅతిథిగా హాజరై ఆటోస్టాండ్ ఏర్పాటు చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ డ్రైవర్ల సమస్యలు తీర్చేందుకు వారికి గుర్తింపు కార్డులు, ప్రభుత్వం నుంచి రావాల్సిన సంక్షేమ పథకాల గురించి పోరాడతామని తెలిపారు. ఏఐటీయూసీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు చంద్ర, ఏఐవైఎఫ్ నియోజకవర్గ నేత మురళి, ఆటో యూనియన్ నేతలు జయరామయ్య, మునిరాజ్, వెంకటరమణయ్య, మురళి, వీరాస్వామి పాల్గొన్నారు.

గర్భిణులకు రొట్టెల పంపిణీ



రొట్టెలు అందజేస్తున్న సాయి

ఏర్పేడు: స్థానిక పీహెచ్‌సీలో గర్భిణులకు మంగళవారం పుట్టపర్తి సాయిబాబా భక్తబృందం ట్రస్టు ఆధ్వర్యంలో రొట్టెల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ట్రస్టు అధ్యక్షుడు సాయి మాట్లాడుతూ ప్రతి నెల క్రమం తప్పకుండా గర్భిణులు పరీక్షలు చేసుకోవాలని సూచించారు. తాజా కూరగాయలు, పప్పుదినుసులతో కూడిన బలవర్ధకమైన భోజనాన్ని తీసుకోవాలన్నారు. గర్భిణులు ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలోనే ప్రసవం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ సురేష్, ట్రస్టు ప్రతినిధులు చంద్రప్రకాష్‌రావు, మునెయ్య, పద్మ, ఉమాభారతి, ఆశ వర్కర్లు, గర్భవతులు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానపు రోడ్డులో ప్రయాణం ఎలా?

- ఛిద్రమైన చిన్నపాండూరు–నాగలాపురం రోడ్డు
- అవస్థలు పడుతున్న వాహనచోదకులు



వెంకటాపురం వద్ద బావులను తలపించే గుంతలు

వరదయ్యపాళెం: నియోజకవర్గంలోని చిన్నపాండూరు–నాగలాపురం రోడ్డు పూర్తిగా ఛిద్రమైంది. బావులను తలపించే గుంతలు ఏర్పడడంతో ఈ అధ్వానపు రోడ్లో ప్రయాణం ఎలా? అంటూ వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల తరచూ పడుతున్న వర్షపు జల్లులకు రోడ్డు పూర్తిగా ధ్వంసమై ఆ మార్గంలో వాహనాలు రాకపోకలు ఇబ్బందికరంగా మారింది. గతంలో చిన్నపాండూరు నుంచి నాగలాపురం మార్గంలో చమర్తకండ్రిగ వరకు డబుల్‌రోడ్డును నిర్మించారు. అయితే చమర్తకండ్రిగలో 3 కంకర క్వారీలు ఉండడం, అక్కడ నుంచి వందల లారీలు అధిక బరువుతో ఆ మార్గంలో వాహన రాకపోకలు సాగిస్తుండడంతో రోడ్డు పూర్తిగా ఛిద్రమైనట్లు గ్రామస్తులు వాపోతున్నారు. అధిక బరువు కలిగిన వాహనాలు పెద్దఎత్తున ఈ ప్రాంతంలో తిరుగుతున్నప్పటికీ వాటిని నియంత్రించాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో తూలితూగుతూ తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది. కనీసం గుంతలు పడిన ప్రాంతంలో ప్యాచ్‌లు వేసే పరిస్థితిలో కూడా ఆర్‌అండ్‌బీ అధికారులు లేకపోవడం గమనార్హం. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

స్వచ్ఛందంగా గుంతల పూడ్చివేత



రోడ్డుపై గుంతలను పూడ్చుతున్న యువకుడు

వరదయ్యపాళెం: ఆర్‌అండ్‌బీ రోడ్డుపై పడ్డ గుంతలు అటు అధికార పక్షానికి, ఇటు ప్రభుత్వ అధికారులకు ఏమాత్రం కళ్లకు కనిపించవు. వాహనదారులుగా మాకు నిత్యం ఎదురుపడుతున్న గుంతల్లో ప్రమాదాలకు గురవుతున్నాం. ఇక స్వచ్ఛందంగా మేమైనా గుంతలు పూడ్చుకుని ప్రమాదాలను కాస్తో కూస్తో నివారించేందుకు మాప్రయత్నం చేస్తున్నామంటూ సత్యవేడు–కడూరు కూడలి ప్రధాన రోడ్డు మార్గంలోని రాచర్ల వద్ద యువకులు రెడ్డి దేవదాసు, రెడ్డి రవికుమార్, జేసీబీ యజమాని సురేష్ మంగళవారం సాయంత్రం స్వచ్ఛందంగా గుంతలు పూడ్చి తమవంతు సమాజ సేవకులుగా ముందుకొచ్చారు. వారి సేవాదృక్పథానికి అటువైపుగా వెళ్తున్న వాహనదారులు అభినందనలు తెలిపారు.

పరిశుభ్రతతోనే అంటు వ్యాధులకు అడ్డుకట్ట



నగరంలో పర్యటిస్తున్న కమిషనర్ అదితిసింగ్

తిరుపతి తుడా: నగరంలోని ప్రతి ఒక్కరూ చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే అంటు వ్యాధులు దరిచేరవని నగరపాలక సంస్థ కమిషనర్ అదితిసింగ్ అన్నారు. నగరపాలక సంస్థ పరిధిలోని తిమ్మినాయుడుపాలెం, హరిజనవాడ, రెడ్డిగుంట, ఉప్పరపాలెం తదితర ప్రాంతాల్లో హెల్త్, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి మంగళవారం తెల్లవారు జాము నుండి కమిషనర్ పారిశుద్ధ్య పనులు, తాగు నీటి సరఫరాపై ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డెంగీ, డయేరియా వంటి వ్యాదులు ప్రబలకుండా నగరపాలక సంస్థ తరఫున ఎన్ని చర్యలు చేపట్టినా ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయని, వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ముఖ్యంగా ఇళ్ల పరిసరాల్లో ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని కోరారు. వారంలో ఒక రోజు ఇంట్లోని వాటర్ ట్యాంకులు శుభ్రం చేసి డ్రై డే పాటించాలని తెలిపారు. హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, మున్సిపల్ ఇంజినీర్ వెంకట్రామిరెడ్డి, డీఈఈ విజయకుమార్ రెడ్డి, శానిటరీ సూపర్ వైజర్స్ చెంచయ్య, సుమతి తదితరులు ఉన్నారు.

నాపై వార్తలు రాస్తే అంతు చూస్తా!

శ్రీకాళహస్తి: తనపై వార్తలు రాస్తే అంతు చూస్తానని ఓ విలేకరిని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి మంగళవారం బెదిరించారు. ఇటీవల విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిన సందర్భంగా ప్రెస్‌మీట్ ముగిసిన అనంతరం ఆలయంలో బదిలీల్లో రూ.5 కోట్లు వసూలు చేశారని వార్త రాశావని, ఈ సారి ఆ విధంగా వార్త రాస్తే నీ అంతు చూస్తానంటూ బెదిరించారు. దీనిపై ఆ విలేకరి ఆవేదన వ్యక్తం చేశాడు. వార్త రాసినపుడు తప్పులు ఉంటే ఖండించాలని, విలేకరుల అంతు చూస్తామని బెదిరించడం శ్రీకాళహస్తి చరిత్రలో ఎప్పుడూ లేదని ఆ విలేకరి ఆవేదన వ్యక్తం చేశాడు.



సారొస్తున్నారని...

రాయలసీమకే తలమానికమైన రుయా పేదల పాలిట సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి. ఈ ఆస్పత్రి ఎమర్జెన్సీ వార్డు ఎదుట చిన్నపాటి వర్షానికే వర్షపునీరు నిలిచి మురుగు కూపంగా మారింది. అయితే రుయాలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితుల పరామర్శించేందుకు మంగళవారం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ రుయాకు వచ్చారు. సారొస్తున్నారని ఆస్పత్రి సిబ్బంది ఎమర్జెన్సీ వార్డు వద్ద మురుగునీరు తొలగించారు. ఇసుక పోసి మురుగును కప్పిపుచ్చారు. గత మూడు రోజులుగా నిల్వ ఉన్న మురుగునీరు ఒక్కసారిగా కనుమరుగవడంతో రోగులు సంతోషం వ్యక్తం చేశారు. సారు రావడంతో మురుగు కూపం తగ్గి దోమల బెడద తప్పిందంటూ చర్చించుకున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

అభ్యసన సామర్థ్యాన్ని మెరుగు పరుచుకోండి



ప్రార్థన సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రాజు

నారాయణవనం: విద్యార్థులు అభ్యసన సామర్థ్యాన్ని మెరుగు పరుచుకోవాలని ఇన్‌చార్జ్ డిప్యూటీ డీఈఓ ప్రభాకర్‌రాజు సూచించారు. మంగళవారం నారాయణవనం బాలుర ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ప్రార్థనా సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన అభ్యసన గుర్తింపును తీసుకొస్తుందని అన్నారు. గత 10వ తరగతి ఫలితాల్లో మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో మెరుగైన ఫలితాలు నమోదయ్యాయని అన్నారు. ఈ ఏడాది ఉత్తమ ఫలితాలను సాధించడానికి పోటీతత్వంతో చదవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటిస్తే, విద్యార్థుల్లోనూ ప్రభావం చూపుతుందని ఆయన అన్నారు. అనంతరం పాఠశాల రికార్డులను పరిశీలించి, విద్యార్థులందరికీ యూనిఫాం, పుస్తకాలు అందివ్వాలని సూచించారు. మధ్యాహ్న భోజనం శుచిగా, రుచిగా తయారు చేయించాలని హెచ్‌ఎం సులోచనమ్మకు సూచనలు చేశారు.

విద్యార్థికి అభినందన



విద్యార్థికి స్వీట్లు, పండ్లు అందించి అభినందిస్తున్న ఎంఈఓలు ప్రేమలత, దయాకర్‌రావు

ఏర్పేడు: ఇటీవల జరిగిన నవోదయ ప్రవేశ పరీక్షలో ప్రతిభ చూపి, ఆ పాఠశాలలో చేరిన విద్యార్థికి మంగళవారం అభినందన సభ నిర్వహించారు. మండలంలోని పంగూరు ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థి మునిరామకృష్ణ నవోదయకు ఎంపికయ్యాడు. ఈ నేపథ్యంలో ఎంఈఓలు ప్రేమలత, దయాకర్‌రావు ఆధ్వర్యంలో సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచి పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. నవోదయలాంటి పాఠశాలల్లో చదివిన ఎంతో మంది విద్యార్థులు సివిల్స్ పరీక్షలు రాసి ఎంపికైనట్లు పేర్కొన్నారు. నవోదయకు ఎంపికయ్యేలా బోధన, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను కొనియాడారు. అనంతరం విద్యార్థికి పండ్లు, స్వీట్లు అందించి అభినందించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 దయాకర్ రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాడు–నేడు పనులు వేగవంతం



భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంఈఓ మునిసుబ్రమణ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నాడు–నేడు రెండవ విడత పనులను వేగవంతం చేసి, త్వరతిగతిన పూర్తిచేయాలని ఎంఈఓ మునిసుబ్రమణ్యం ఆదేశించారు. ఆయన మంగళవారం గాజులపెళ్లూరు పంచాయతీ పరిధిలోని ఆదిలక్ష్మయ్య గిరిజన కాలనీలోని ప్రాథమిక పాఠశాల్లో నాడు–నేడు 2వ విడతలో నిర్మిస్తున్న ప్రహరీ గోడ, భవన నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో నాడు–నేడు మొదటి విడతలో 27 పాఠశాలల్లో రూ.5 కోట్లతో పనులు పూర్తి అయ్యాయని, అదేవిధంగా రెండవ విడతలో రూ, 6 కోట్లతో 22 పాఠశాలల్లో జరుగుతున్న పనులు వేగవంతం చేసి పూర్తిచేయాలన్నారు. నాడు–నేడు పనులతో పాఠశాలల భవనాల రూపురేఖలు మారిపోయాయని తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్‌డీకే నగర్‌లో భారీ చోరీ

- రూ.3.50 లక్షలు నగదు
- 40 సవర్ల బంగారు అపహరణ



పగులగొట్టిన బీరువా

శ్రీకాళహస్తి: పట్టణంలోని దక్షిణకై లాసనగర్‌లో సోమవారం అర్ధరాత్రి భారీ చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు ఓ ఇంటి తాళాలను పగులగొట్టి బీరువాలోని రూ.3.50 లక్షల నగదు, 40 సవర్ల బంగారం అపహరించుకుని పారిపోయారు. రెండో పట్టణ సీఐ రారాజు కథనం మేరకు.. దక్షిణ కైలాసనగర్‌లోని ఓ అద్దె ఇంట్లో సిరాజ్ మిషా అనే మహిళ తన కుమారుడితో కలిసి ఉంటోంది. ఆదివారం సాయంత్రం కుమారునితో కలిసి చెన్నైలోని బంధువుల ఇంటికి వెళ్లింది. ఈ నేపథ్యంలో పక్కాగా రెక్కీ నిర్వహించిన దుండగులు సోమవారం రాత్రి కట్టర్ల సాయంతో తాళాలను కత్తిరించి లోనికి ప్రవేశించారు. బీరువాలోని దాచిన రూ.3.50 లక్షలు నగదు, 40 సవర్ల బంగారు నగలను దోచుకెళ్లారు. మంగళవారం ఉదయం సిరాజ్ మిషా ఇంటి తాళాలు తెరిచి ఉండడంతో స్థానికులు ఆమెకు సమాచారం అందించారు. ఆమె చెన్నై నుంచి హుటాహుటిన ఎస్‌డీకే నగర్‌కు చేరుకుంది. రెండో పట్టణ పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఆధారాలు సేకరించారు. బాధితురాలు సిరాజ్‌మిషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మలుపులో ముళ్లపొదలను తొలగించండి



వంతెన వద్ద ముళ్లపొదలు

- ప్రమాదాలకు నిలయంగా మలుపు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాటూరు గ్రామం సమీపంలోని కాళంగి నదిపై నిర్మించిన వంతెన మలుపు వద్ద ముళ్లపొదలుండడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వంతెన మలుపువద్ద పెద్ద ముళ్లచెట్లు ఉండడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కంటికి కనపడక పోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. వారంలో రెండు, మూడుసార్లు ప్రమాదాల బారిన పడి వాహనదారులు ఆస్పత్రుల పాలవుతున్నారు. వంతెన మలుపు వద్ద నున్న ముళ్లచెట్లను తొలగించాలని పలుమార్లు ఆర్‌అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధితశాఖ ఉన్నతాధికారులు స్పందించి ముళ్లపొదలను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

మాంసాహార ఉత్పత్తుల తయారీపై శిక్షణ



శిక్షణ ఇస్తున్న వెటర్నరీ వర్సిటీ అధ్యాపకులు

తిరుపతి సిటీ: ఎస్వీ వెటర్నరీ వర్సిటీ పశు ఉత్పత్తుల సాంకేతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మంగళవారం గ్రామీణ మహిళలకు మాంసాహార ఉత్పత్తుల తయారీపై ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వెటర్నరీ వర్సిటీ డీన్ వీరబ్రహ్మయ్య, పశువైద్య కళాశాల అసోషియేట్ డీన్ జగపతిరామయ్య ముఖ్యఅతిథులుగా విచ్చేసి, విలువ చేకూరిత మాంసాహార ఉత్పత్తుల తయారీలో నైపుణ్యాన్ని పెంపొందించుకునే సూచనలు వివరించారు. అనంతరం చికెన్ సమోసాలు, చికెన్ ఇడ్లీ, చికెన్ నగ్గెట్స్, సూప్‌లు, చికెన్ ఊరగాయలు తదితర ఆహార పదార్థాల తయారీపై గ్రామీణ మహిళలకు మెళకువలను నేర్పించారు. శిక్షణ పొందిన మహిళలకు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, సుధీర్, నవీన్, పెద్ద సంఖ్యలో మెప్మా మహిళలు పాల్గొన్నారు.